సాక్షి ఖమ్మం
బుధవారం । 22 । జనవరి । 2025



బాధ్యులెవరు?

రేగళ్లపాడు నర్సరీలో 3లక్షలకు పైగా ఆయిల్‌పామ్ మొక్కలు పనికిరావని తేలడంతో ఇందుకు బాధ్యులెవరనే చర్చ మొదలైంది. 8లో



ఓవరాల్ చాంప్.. ఏఆర్ జట్టు

పోలీసు క్రీడోత్సవాల్లో సిటీ ఏఆర్ జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించగా సీపీ సునీల్‌దత్ ట్రోఫీ అందజేశారు. 8లో



వాతావరణం

జిల్లాలో బుధవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. సాయంత్రం తర్వాత క్రమంగా చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు నేలకొండపల్లి మండలం ముఠాపురం చేరుకోనున్న ఆయన సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశాక గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. ఆతర్వాత కోరట్లగూడెం, కోనాయిగూడెం, పైనంపల్లి, అప్పల నర్సింహాపురం, కట్టుకాచారం, కొంగర, బుద్దారంల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 4గంటలకు ఇల్లెందు మండలం లలితాపురం క్రాస్‌లో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశాక సెంట్రల్ లైబ్రరీ భవనాన్ని ప్రారంభిస్తారు. అలాగే, ఎన్‌టీఆర్ సర్కిల్‌లో బుగ్గవాగు సుందరీకరణ, ఫిల్టర్‌బెడ్ ఏరియాలో మున్సిపల్ గెస్ట్‌హౌజ్‌ను పునర్నిర్మాణ పనులను ప్రారంభించాక మున్సిపల్ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 2వ వార్డులో సీసీ రోడ్లు, గోవింద్ సెంటర్‌లో పీహెచ్‌సీ భవనం, పాకాల రోడ్డులో రోడ్డు విస్తరణ, లైటింగ్ పనులను ప్రారంభించనున్నారు.

ఉద్యోగుల జట్ల ఎంపికకు పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాలోని సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు సంబంధించి క్రీడాజట్ల ఎంపికకు మంగళవారం పోటీలు నిర్వహించారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో వాలీబాల్, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల్లో పోటీలు ఏర్పాటుచేయగా పురుషులు 30, మహిళా ఉద్యోగులు 20 మంది హాజరయ్యారు. ఎంపిక ప్రక్రియను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, పీడీలు కె.నర్సింహామూర్తి, శ్రీనివాస్ పర్యవేక్షించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: గురుకులాల్లో ప్రవేశాలకు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ రాసేందుకు విద్యార్థులు ఫిబ్రవరి 1లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. వచ్చే విద్యాసంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పించనుండగా, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతుల వరకు ఖాళీలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అంతేకాక గౌలిదొడ్డి, అలుగునూరులోని సీఓఈల్లో 9వ తరగతి, ఖమ్మం, పరిగిలోని టీజీటీడబ్ల్యూఆర్ ఈఐఎస్‌ల్లో 8వ తరగతి, రుక్మాపూర్‌లోని సైనిక్ స్కూల్, మల్కాజిగిరిలోని ఫైనాన్స్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు వచ్చేనెల 1వ తేదీలోపు కులం, ఆదాయం, పుట్టినతేదీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23న ఉంటుందని, వివరాలకు https://tgcet.cgg.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని కలెక్టర్ వెల్లడించారు.

మల్బరీ సాగుకు ప్రోత్సాహం



సదస్సులో మాట్లాడుతున్న డీడీ ముత్యాలు

కల్లూరు: మల్బరీ తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోందని సెరికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఏ.ముత్యాలు తెలిపారు. కల్లూరులో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రెండెకరాల్లో నాటడానికి 11వేల మొక్కలు అవసరమవుతాయని, వీటిని రూ.2 చొప్పున వెచ్చించి కొనుగోలు చేయాలని తెలిపారు. అయితే, రెండెకరాలకు కావాల్సిన మొక్కల కొనుగోలు, రవాణా, దున్నడంతో పాటు ఇతర ఖర్చులపై ప్రభుత్వం రూ.60 వేల సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. పట్టు పురుగుల పెంపకానికి అవసరమైన షెడ్ నిర్మాణానికి సైతం ఎస్సీ, ఎస్టీలకైతే రూ.2,92,500, ఇతరులకు రూ.2.25 లక్షల సబ్సిడీ అందుతుందని తెలిపారు. పట్టు గూళ్ల కిలో ధర ప్రస్తుతం రూ.650 నుంచి రూ.750 ధర పలుకుతున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైరా కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కె.రవికుమార్, శాస్త్రవేత్త వి.చైతన్య, ఉద్యానశాఖ అధికారి జి.నగేష్ పాల్గొన్నారు.

నిధుల మళ్లింపుపై విచారణ

ఖమ్మం సహకారనగర్: జిల్లా విద్యాశాఖలోని సమగ్ర శిక్షా అభియాన్ విభాగానికి సంబంధించి సుమారు రూ.1.82కోట్లు దుర్వినియోగమైనట్లు అధికారులు కొన్నాళ్ల క్రితం గుర్తించారు. ఈ నిధులను కొందరు సిబ్బంది దారి మళ్లించినట్లు గుర్తించగా వారిపై చర్యలు సైతం తీసుకున్నారు. ఈ అంశంపై మంగళవారం రాష్ట్ర స్థాయి అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వచ్చిన అధికారులు బ్యాంక్ ఖాతాలు, ఇతర రికార్డులను పరిశీలించినట్లు సమాచారం. నిధులను ఏ ఖాతాలోకి, ఎలా మళ్లించారనే అంశంపై ఆరా తీసినట్లు తెలిసింది.



మంచుకొండ సభలో ఆందోళనకు దిగిన వారికి నచ్చజెబుతున్న పోలీసులు



కూసుమంచి మండలం గట్టుసింగారంలో అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు



కారేపల్లి మండలం భజ్యాతండాలో వాగ్వాదానికి దిగిన ఇరువర్గాలు

నిరసనలు.. నిలదీతలు

తొలిరోజు గ్రామ, వార్డు సభల్లో ఇదీ పరిస్థితి

- నాలుగు పథకాలకు లబ్ధిదారుల జాబితాలు వెల్లడి
- అనర్హుల పేర్లు ఉన్నాయంటూ పలువురి అభ్యంతరాలు
- పలు ప్రాంతాల్లో రభస... నచ్చజెప్పిన అధికారులు
- మరోమారు దరఖాస్తులు స్వీకరించడంతో శాంతించిన జనం



ఖమ్మం 3వ డివిజన్ సభలో జాబితాలోని పేర్లు చూసుకుంటున్న స్థానికులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రప్రభుత్వం ఈనెల 26నుంచి అమలుచేయనున్న సంక్షేమ పథకాల అర్హులను ప్రకటించేందుకు నిర్వహించిన గ్రామసభలు తొలిరోజు రసాభాసగా ముగిశాయి. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను మంగళవారం నిర్వహించిన గ్రామ, వార్డుసభల్లో ప్రకటించగా అర్హులకు చోటు దక్కలేదని పలుచోట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. దీంతో గందరగోళ పరిస్థితులు నెలకొనగా అధికారులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ తామెందుకు అర్హులం కాదంటూ నిలదీయగా మరోమారు దరఖాస్తులు స్వీకరించి అర్హులందరికీ న్యాయం చేస్తామని ప్రకటించడంతో శాంతించారు. ఖమ్మంరూరల్ మండలం గోళ్లపాడు, ఖమ్మం ఆరో డివిజన్‌లో జరిగిన సభల్లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పాల్గొనగా, వివిధ ప్రాంతాల్లో సభలకు సీపీ సునీల్‌దత్ హాజరై బందోబస్తును పర్యవేక్షించారు.

అభ్యంతరాల నడుమ..

నాలుగు సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల జాబితాలను మూడు రోజుల పాటు నిర్వహించే గ్రామ, వార్డుసభల్లో ప్రకటించి అభ్యంతరాలు స్వీకరిస్తామని అధికారులు తెలిపారు. తొలిరోజైన మంగళవారం చాలాచోట్ల నిరసనల నడుమే సభలు కొనసాగాయి. అర్హులకు పథకాలు మంజూరు కాలేదని అధికారులను నిలదీశారు. ఒకే ఇంట్లో నలుగురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని అభ్యంతరం తెలిపారు. పెళ్లి కాని వారికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేయగా.. భూమి లేని తమను ఉపాధి కూలీ పనులు చేయలేదన్న కారణంతో ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేయకపోవడం సరికాదని పలువురు పేర్కొన్నారు.

అర్హుల గుర్తింపునకే...

గ్రామసభల్లో ప్రజలు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. అర్హులకు మాత్రమే పథకాలు వర్తించేందుకే సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సభల్లో వచ్చిన అభ్యంతరాలపై విచారిస్తామని, ఫిర్యాదులు నిజమని తేలితే అనర్హుల పేర్లు తొలగించి అర్హులకే ఇస్తామని చెప్పారు. ఈమేరకు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో పలువురు అక్కడికక్కడే దరఖాస్తులు అందజేశారు. పలుచోట్ల పోలీస్ పహారా మధ్య సభలు కొనసాగాయి.

గ్రామ, వార్డుసభల్లో అందిన దరఖాస్తులు

పథకం	గ్రామసభలు	వార్డు సభలు
ఇందిరమ్మ ఇళ్లు	12,313	2,470
రేషన్‌కార్డులు	13,460	2,261
రైతుభరోసా	1,551	14
ఆత్మీయ భరోసా	9,201	12
మొత్తం	36,525	4,757

నియోజకవర్గాల వారీగా..

- ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలం మంచుకొండ సభలో అర్హులకు పింఛన్, ఇళ్లు మంజూరు కాలేదని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఖమ్మం మూడో డివిజన్‌లో నిర్వహించిన సభలోనూ ఇదే పరిస్థితి ఎదురుకాగా ఒకే ఇంట్లో ముగ్గురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని ఆరోపించారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 1నుంచి 20వ డివిజన్లలో సభలు నిర్వహిస్తే చాలాచోట్ల ఇదే పరిస్థితి ఎదురైంది.
- పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం గట్టుసింగారంలో నిర్వహించిన గ్రామసభను గ్రామస్తులు అడ్డుకున్నారు. అర్హులైన వారి పేర్లు జాబితాలో లేవని ఆందోళనకు దిగారు.
- సత్తుపల్లి నియోజకవర్గం కిష్టారంలో పెళ్లి కాని వారికి రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని, ఇళ్లు ఉన్న వారికి కూడా మంజూరు చేశారని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. వేంసూరు మండలం కుంచపర్తి, భీమవరం సభల్లో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు కాలేదని అధికారులను పలువురు నిలదీశారు.

దరఖాస్తుల వెల్లువ

తొలిరోజు జిల్లాలోని 208 గ్రామాలు, ఖమ్మం కార్పొరేషన్‌లోని 20డివిజన్లు, మధిర, సత్తుపల్లి, వైరా మున్సిపాలిటీల్లోని 22 వార్డుల్లో కలిపి 250 సభలు జరిగాయి. ఇక్కడ అర్హుల జాబితాలు ప్రకటించడమే కాక ఆయా పథకాలకు దరఖాస్తులు స్వీకరించారు. దీంతో 41,282 దరఖాస్తులు అందాయి. వీటిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 14,783, రేషన్‌కార్డుల కోసం 15,721, రైతు భరోసా కోసం 1,565, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 9,213 దరఖాస్తులు వచ్చాయని అధికారులు వెల్లడించారు.

- వైరా నియోజకవర్గం దాచాపురం సభలో అర్హులను ఎంపిక చేయలేదని గ్రామస్తులు ఆందోళన చేశారు. కొణిజర్ల మండలం చిన్న మునగాలలో లబ్ధిదారుల పేర్లు అధికారులు చదువుతుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామసభ ఆమోదం పొందితేనే జాబితా ఖరారవుతుందని అధికారులు చెప్పినా వినకపోవడంతో మళ్లీ దరఖాస్తులు తీసుకున్నారు. కారేపల్లి మండలం బజ్జితండా గ్రామసభ కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్లు మారింది. కాంగ్రెస్ నాయకులు తమ వారి పేర్లను కావాలనే తీయించారని ఆరోపించడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సూర్యాతండాలోనూ బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గీయుల నడుమ వాగ్వాదం జరగగా, వెంకట్యాతండా సభలో జాబితాపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.
- మధిర నియోజకవర్గంలోని ఇల్లూరులో ఆత్మీయ భరోసా జాబితాలో తమ పేర్లు లేవని పలువురు ప్రశ్నించారు. బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి, లక్ష్మీపురంల్లో అర్హులకు రేషన్‌కార్డులు, ఇళ్లు మంజూరు కాలేదని, ఎర్రుపాలెం మండలం జమలాపురం, మీనవోలుల్లో అర్హులైన వారికి రేషన్‌కార్డులు మంజూరు కాలేదని నిలదీశారు. చింతకాని, ముదిగొండ మండలాల్లోని గ్రామాల్లో జరిగిన సభల్లోనూ అధికారులకు ఇదే అనుభవం ఎదురైంది.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంఅర్బన్/ఖమ్మం రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ఖమ్మం 6వ డివిజన్, ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడులో మంగళవారం జరిగిన సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. జాబితాల్లో అనర్హులు ఉంటే పరిశీలించి తొలగిస్తామన్నారు. ఇదే సమయాన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్ కార్డుల కోసం అర్హులకు చోటు కల్పిస్తామని, దరఖాస్తులు తెలిపారు. ఈ సభల్లో అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, అధికారులు జి.జ్యోతి, నర్సింహారావు, పి.రాంప్రసాద్, శ్రీదేవి, కార్పొరేటర్ నాగండ్ల కోటి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియ

ఖమ్మం సహకారనగర్: సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక నిరంతరం కొనసాగుతుందనే అంశాన్ని ప్రజలకు వివరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. పలువురు మంత్రులు, సీఎస్ శాంతికుమారితో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అభ్యంతరాలను పరిశీలించి అనర్హుల పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. జిల్లా నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో 250 సభలు నిర్వహించగా దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు.

బందోబస్తును పర్యవేక్షించిన సీపీ



సభావేదిక వద్ద సూచనలు చేస్తున్న సీపీ సునీల్‌దత్

రఘునాథపాలెం/ఖమ్మం క్రైం: గ్రామ, వార్డుసభలు సాఫీగా జరిగేలా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల సభలను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. రఘునాథపాలెం మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన సభల్లో జనం సంక్షేమ పథకాల జాబితాలో తమ పేర్లు లేవని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచుకొండ సభలో భారీగా హాజరైన జనం లబ్ధిదారులుగా గుర్తించిన వారి ఇళ్లను తమ సమక్షాన పరిశీలించాలని డిమాండ్ చేశారు. దీంతో జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మ ఇది తుది జాబితా కాదని నచ్చచెప్పారు. అక్కడకు వచ్చిన సీపీ సునీల్‌దత్ సైతం వారికి సర్దిచెప్పారు. మండలంలోని ఇతర చోట్ల కూడా ఇదే పరిస్థితి నెలకొనగా గణేశ్వరం సభలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, శివాయిగూడెంలో జెడ్పీ సీఈఓ దీక్షారైనా, ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, చింతగుర్తి సభలో అడిషనల్ డీఆర్‌డీఓ శిరీష, మార్కెట్ చైర్మన్ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, చింతకాని మండలం నాగులవంచ, ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి సభలను కూడా సీపీ పరిశీలించారు.

ఆర్టీసీకి సం'క్రాంతి'

- 12 రోజుల్లో రూ.20.73 కోట్ల ఆదాయం
- సంస్థకు కలిసొచ్చిన పండుగ సర్వీసులు
- రీజియన్‌లో 25.80 లక్షల మంది మేర ప్రయాణం



ఖమ్మం పాత బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ ఖమ్మం రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు నడిపించింది. ఈనెల 9వ తేదీ నుండి 20వ తేదీ వరకు షెడ్యూల్ సర్వీసులకు తోడు అదనపు సర్వీసులు తిప్పడంతో సంస్థకు భారీగా ఆదాయం నమోదైంది. పండుగకు వారం రోజులే కాక ఆ తర్వాత వారాంతపు సెలవులు కలిసి రావడంతో 20వ తేదీ వరకు ప్రత్యేక సర్వీసులు కొనసాగాయి. ఈ బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేయగా సంస్థకు భారీగానే లాభాలు వచ్చాయి. మొత్తం 12 రోజుల్లో ఏడు డిపోల పరిధిలో 25.80 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించగా రూ.20.73 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది.

1,277 బస్సులు

ఈనెల 11నుంచి సంక్రాంతి సెలవులు ప్రారంభం కాగా.. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ 9వ తేదీ నుండే ప్రత్యేక బస్సులు నడిపింది. ఈమేరకు 9నుండి 14వ తేదీ వరకు వరకు హైదరాబాద్ నుండి ఉమ్మడి జిల్లాలోని మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ప్రాంతాలకు బస్సులు నడిపించారు. ఇక 15నుండి 20వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా నుండి హైదరాబాద్‌కు సర్వీసులు ఏర్పాటుచేశారు. షెడ్యూల్ ప్రకారం నడిచే బస్సులు కాకుండా అదనంగా 1,277 బస్సులను నడిపించడం విశేషం.

30.96 లక్షల కిలోమీటర్లు

సెలవుల్లో ఆర్టీసీ అధికారులు ఉమ్మడి జిల్లా నుండి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుండి ఉమ్మడి జిల్లాకు మొత్తం 30.96 లక్షల కి.మీ. బస్సులు తిప్పారు. 25.80 లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించడంతో ఆర్టీసీకి రూ.20.73 కోట్ల ఆదాయం సమకూరింది. రీజియన్‌లో 104 ఆక్యూపెన్సీ రేషియో(ఓఆర్) నమోదవగా, మహాలక్ష్మి పథకం ద్వారా 15.97 లక్షల మంది మహిళలు ప్రయాణించారు. కాగా, హైదరాబాద్ నుండి ఉమ్మడి జిల్లాకు ఈనెల 11న, తిరుగు ప్రయాణంలో ఈనెల 19న అత్యధికంగా రూ.2.34లక్షల మంది ప్రయాణం సాగించారు. దీంతో ఆ రెండు రోజుల్లో రెగ్యులర్, స్పెషల్ సర్వీసులే కాక 79 చొప్పున అదనపు బస్సులు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. సంక్రాంతి పండుగకు ఉమ్మడి జిల్లా ప్రజలే కాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కూడా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా తమ స్వస్థలాలకు వెళ్లారు. ఫలితంగా సత్తుపల్లి డిపోకు అత్యధికంగా 150 రిజర్వేషన్ బస్సులు నడిపించారు.

రీజియన్‌లో డిపోల వారీగా 12రోజుల్లో ప్రయాణికులు, ఆదాయ వివరాలు

డిపో	ప్రయాణికులు (లక్షల్లో)	ఆదాయం (రూ.ల్లో)	కిలోమీటర్ల (లక్షల్లో)	ఓఆర్
ఖమ్మం	5.41	4,86,69,000	7.57	100.89
మధిర	1.29	2,29,47,000	3.34	109.89
సత్తుపల్లి	6.12	3,73,25,000	5.49	106.16
భద్రాచలం	3.44	3,99,05,000	6.02	100.73
కొత్తగూడెం	3.35	2,22,60,000	3.22	107.89
మణుగూరు	4.16	3,02,32,000	4.30	108.92
ఇల్లెందు	0.99	60,10,000	1.01	105.46

ప్రణాళికాయుతంగా బస్సులు



సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వచ్చివెళ్లే ప్రయాణికుల కోసం ప్రణాళికాయుతంగా బస్సులు నడిపించాం. రద్దీని పరిశీలిస్తూ అప్పటికప్పుడు అదనపు సర్వీసులు ఏర్పాటుచేశాం. నిరంతర పర్యవేక్షణతో ప్రయాణికులకు ఎక్కడా ఇబ్బంది ఎదురుకాలేదు. ప్రజల నమ్మకం మేరకు ఆర్టీసీ బస్సుల్లో వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాం.

– ఏ.సరిరామ్, ఆర్ఎం, ఆర్టీసీ ఖమ్మం రీజియన్

గణపేశ్వరా.. ఎన్నాళ్లకెన్నాళ్లకు!

- త్వరలోనే కూసుమంచిలోని శివాలయానికి మహర్దశ
- అభివృద్ధి పనులకు రూ.3.30 కోట్లు మంజూరు
- మంత్రి పొంగులేటి చొరవతో అభివృద్ధికి అడుగులు



కూసుమంచిలోని శివాలయం

కూసుమంచి: కూసుమంచిలోని కాకతీయుల కాలం నాటి శివాలయం(గణపేశ్వరాలయం)కు పూర్వవైభవం రానుంది. పాలేరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించగా ప్రభుత్వం నుండి రూ.3.30 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈమేరకు అభివృద్ధి పనులు పూర్తయితే ఆలయం పూర్వ శోభ సంతరించుకోనుండగా ఈ ప్రాంతం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు.

కాకతీయుల కాలంలో నిర్మాణం

కాకతీయుల భక్తిభావానికి మచ్చుతునకగా కూసుమంచి శివాలయం నిలుస్తోంది. క్రీ.శ 11–12వ శతాబ్దంలో కాకతీయుల పరిపాలనలో వెయ్యినొక్కటి శివాలయాల నిర్మాణం చేపట్టగా గణపతి దేవుడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ప్రతీతి. ఇక్కడ శివలింగం ఆసియా ఖండంలోనే అతిపెద్దదిగా ప్రసిద్ధి చెందింది. ఆలయ నిర్మాణాన్ని ఓ చేయి, కాలు లేని శిల్పి చేశాడని ప్రచారంలో ఉండగా, నున్నగా చెక్కిన పెద్దపెద్ద బండరాళ్లను నిలబెట్టిన తీరు అబ్బురపరుస్తుంది. వెయ్యేళ్ల క్రితం నిర్మించినా భూకంపాలు, ప్రకృతి వైపరీత్యాలు తట్టుకుని నిలబడడం విశేషం. శివలింగంపై సూర్యోదయ సమయాన సూర్యకిరణాలు ప్రసరించేలా తీర్చిదిద్దడం మరో అద్భుతమని చెప్పాలి. అయితే, రాను రాను ఆదరణ కోల్పోయి 2001 వరకు కంపచెట్ల మధ్య ఉన్న ఈ ఆలయాన్ని నాడు కూసుమంచి సీఐగా పనిచేస్తున్న సాధు వీరప్రతాపరెడ్డి గ్రామస్తులు, పెద్దల సహకారంతో దారి ఏర్పాటు చేసి పూజలు ప్రారంభించారు. ఆ తర్వాత దేవాదాయ, పర్యాటక శాఖలు గుర్తించడంతో కొన్ని సౌకర్యాలు సమకూరాయి. ఆపై మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమికి వేలాదిగా భక్తులు వస్తుంటారు. ఈనేపథ్యాన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించడంపై మంత్రి పొంగులేటికి ఆలయ చైర్మన్ రేలా ప్రదీప్‌రెడ్డి ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

ఏమేం చేస్తారంటే...

ప్రభుత్వం కేటాయించిన రూ.3.30 కోట్లతో ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనుల వివరాలిలా ఉన్నాయి. దేవతామూర్తుల కల్యాణం కోసం రూ.26 లక్షలతో మండపం, రూ.1.41 కోట్లతో ప్రాకారం గోడ, రూ.1.25 కోట్లతో శుభద మండపం, రూ.8.50లక్షలతో పాకశాల, రూ.14.50 లక్షలతో ఆర్చిగేటు, రూ.15.50 లక్షలతో కార్యాలయ గది, స్టోర్ రూం నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు.

క్లుప్తంగా

రేపు జాబ్ మేళా

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం టేకులపల్లిలోని జిల్లాలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈనెల 23న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు. శ్రీరామ్ గ్రూప్స్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లుగా 50మంది ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈమేరకు 20నుండి 35ఏళ్ల వయస్సు కలిగి డిగ్రీ అర్హతతో పాటు ద్విచక్రవాహనం, లైసెన్స్ కలిగిన పురుషులు సర్టిఫికెట్ల జిరాక్స్‌తో హాజరు కావాలని సూచించారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

నేలకొండపల్లి: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య మరింత పెరిగేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి సూచించారు. నేలకొండపల్లి మండలం బోదులబండ పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేసిన ఆమె రికార్డులు పరిశీలించాక ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు సాధారణ ప్రసవాలతో కలిగే లాభాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కాగా, ప్రతీ పీహెచ్‌సీలో కనీసం 100 రకాల మందులు ఉన్నాయని చెప్పారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. జిల్లా ప్రాజెక్ట్ అధికారి దుర్గ, వైద్యాధికారి ఎస్.గీత, ఉద్యోగులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగం కావాలి


మాట్లాడుతున్న డీఎస్పీ మధుమోహన్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: సమాజంలో నానాటికీ పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం, సరఫరా నిర్మూలనలో విద్యార్థులు సామాజిక బాధ్యతగా పాలుపంచుకోవాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల డీఎస్పీ మధుమోహన్‌రెడ్డి సూచించారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులోఆయన మాట్లాడారు. యువత క్షణికానందం కోసం తప్పటడుగు వేస్తే భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని తెలిపారు. ఈ సదస్సులో ఇన్‌స్పెక్టర్ రామునాయక్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సునందతో పాటు డాక్టర్ అబ్దుల్ కరీం తదితరులు పాల్గొన్నారు.

'ఛత్తీస్‌గఢ్‌లో యుద్ధం నిలిపివేయాలి'

ఖమ్మంమయూరిసెంటర్: ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ల పేరిట ఆదివాసీలు, ఉద్యమకారులను నిర్మూలించేలా పాలకులు చేపట్టిన యుద్ధాన్ని నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఆదివాసీలు, విప్లవ ఉద్యమకారులు విదేశీయులు, దురాక్రమణదారులు కాదని, ఈ దేశ మూలవాసులేనని తెలిపారు. ప్రజల అయితే, వనరుల దోపిడీకి మోదీ, అమిత్‌షా చేస్తున్న యుద్ధాన్ని నిలిపివేసి ప్రజలకు శాంతి, కూడు, గూడు, జీవిత భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బీజాపూర్, కాంకర్‌తో పాటు గంగులూర్ ఎన్‌కౌంటర్లను తమ పార్టీ ఖండిస్తుండగా, పౌర సమాజం సైతం నిరసనలు తెలపాలని రంగారావు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య

ఖమ్మంఅర్బన్: ఖమ్మం గొల్లగూడెంలో నివాసముంటున్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బోనకల్ మండలం చొప్పకట్లపాలెంకు చెందిన పరిటాల బాలరాజు(3) కుటుంబంతో సహా గొల్లగూడెంలో ఉంటున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన మద్యం మత్తులో సోమవారం పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూనే మంగళవారం ఆయన మృతి చెందగా భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు.

ఐదు బస్తాల మిర్చి చోరీ

తల్లాడ: తల్లాడలో సోమవారం రాత్రి ఓ రైతుకు చెందిన మిర్చి బస్తాలు చోరీకి గురయ్యాయి. రైతు దగ్గుల శ్రీనివాసరెడ్డి రెండున్నర ఎకరాల్లో మిర్చి సాగు చేయగా మొదటి కోతగా వచ్చిన ఐదు బస్తాల పండు మిర్చిని తోట వద్దే నిల్వ చేశాడు. అయితే, మంగళవారం చూసే సరికి మిర్చి లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈమేరకు రైతుల ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేస్తున్నామని ఎస్ఐ బి.కొండల్‌రావు తెలిపారు.

పంటపై కలుపు మందు పిచికారీ

చింతకాని: చింతకాని మండలం చిన్నమండవకు చెందిన మొగిలి గోపయ్య మిరప తోటపై గుర్తుతెలియని వ్యక్తులు కలుపు నివారణ మందు పిచికారీ చేశారు. దీంతో పంట మొత్తం మాడిపోగా బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్సై నాగుల్మీరా వెల్లడించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

ఆద్యులెవరు.. బాధ్యులెవరు?

- ఆయిల్‌ఫెడ్ నర్సరీలో బయటపడిన అక్రమాలు కొన్నే
- అధికారుల తీరుతో నిండా మునుగుతున్న రైతులు
- రేగళ్లపాడు నర్సరీ ఘటనపై ఆరా తీసిన మంత్రి తుమ్మల


సత్తుపల్లి మండలం నారాయణపురంలో కాపు రాని ఆయిల్‌పామ్ తోటలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

సత్తుపల్లి: ఆయిల్‌పామ్ తోటంటే ఒక క్రేజ్.. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో సాగుకు ముందుకొస్తున్న రైతుల సంఖ్య ఏటా పెరుగుతోంది. రాష్ట్రంలో 2లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుంటే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఇందులో 1.50లక్షల ఎకరాల విస్తీర్ణం ఉంటుంది. గతంలో అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, సత్తుపల్లి, కల్లూరు మండలాలకే పరిమితమైన సాగు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా క్రమంగా విస్తరిస్తోంది. ఈనేపథ్యాన రైతులకు నాణ్యమైన మొక్కలు అందించాల్సిన ఆయిల్‌ఫెడ్ అధికారుల నిర్లక్ష్యం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కోస్టారికా దేశం నుంచి దిగుమతి చేసుకున్న రూ.3కోట్ల విలువైన మొక్కలు ఇప్పుడు పనికి రాకుండా పోవడంతో ఈ తప్పెవరిదనే ప్రశ్న తలెత్తుతోంది.

ఎక్కడ పొరపాటు జరిగింది?

సత్తుపల్లి మండలం రేగళ్లపాడు నర్సరీలో మూడు లక్షలు మొక్కలు పనికిరాకుండా పోవడంపై చర్చ మొదలైంది. కోస్టారికా దేశానికి ఆర్డర్ ఇచ్చిన ఆయిల్‌ఫెడ్ కంపెనీదా.. పిలకమొక్కలు పెంచిన నర్సరీ నిర్వాహకుల లోపమా అన్న అంశం తెలియాల్సి ఉంది. ఆయిల్‌ఫెడ్ నుంచి ఆర్డర్ ఇచ్చేటప్పుడు నాణ్యతను ఒకటికి రెండుసార్లు పరీక్షలు జరిపాకే ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుంది. గతంలో అదే దేశం నుంచి దిగుమతి చేసుకున్న మొక్కలకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే మరింత క్షుణ్ణంగా పరిశీలించాలి. అంతేకాక ఆఫ్‌టైప్(నాటడానికి పనికి రాని) మొక్కలు ఎక్కువగా వస్తుంటే ఎప్పటికప్పుడు ఆయా దేశాలకు నివేదిక పంపిస్తూ రికవరీ చేసుకోవాలి. అయితే ఇప్పటి వరకు లక్షల సంఖ్యలో మొక్కలు ఆఫ్‌టైప్‌గా తేలినా రికవరీ దాఖలాలు లేకపోగా, నర్సరీల్లో విచారణ పేరుతో కాలయాపన చేయడం.. ఒకరిద్దరి అధికారులపై చర్యలు తీసుకుని కప్పిపుచ్చుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఐదేళ్ల నుంచే ఈ తరహా మొక్కలు

1996 నుంచి అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం నర్సరీకి ఆయిల్‌పామ్ పిలకలను ఇతర దేశాల నుంచి తెప్పించి పెంచాక ఉమ్మడి ఏపీలోని రైతులకు అందించేవారు. అప్పట్లో ఆఫ్‌టైప్ ఫిర్యాదులు పెద్దగా నమోదు కాలేదు. ఎకరానికి ఐదారు మొక్కలు వచ్చినా వాటి స్థానంలో మళ్లీ కొత్తవి ఉచితంగా ఇచ్చేవారు. అయితే, ఐదేళ్లుగా ఆఫ్‌టైప్ మొక్కలు ఎక్కువగా వస్తున్నాయనే ఫిర్యాదులు వెల్లువెత్తుతుండగా రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. ఆయిల్‌పామ్ మొక్క నాటాక మూడేళ్లకు ఏపుగా పెరిగి కాపు మొదలవుతుంది. అప్పటివరకు మొక్క ఆఫ్‌టైపా.. లేదా అన్నది గుర్తించే వీల్లే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఉద్యానవన అధికారులు గుర్తించటంతో..

రేగళ్లపాడు నర్సరీలో కోస్టారికా దేశానికి చెందిన ఆయిల్‌పామ్ మొక్కలను ఉద్యానవన అధికారులు భారతి, సూర్యనారాయణ పలుమార్లు తనిఖీలు చేయడంతో ఆఫ్‌టైప్ మొక్కలు ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు బయటపడింది. దీంతో రైతులకు పంపిణీ చేయకుండా ఆపడంతో వారికి మేలు చేసినట్లయింది. లేకపోతే విలువైన సమయాన్ని, డబ్బును నష్టపోయేవారు. గతంలో సత్తుపల్లి మండలం నారాయణపురంలో పుచ్చకాయల సోమిరెడ్డి 12 ఎకరాల్లో నాటిన ఆయిల్‌పామ్ మొక్కలు కాపుకు రాకపోవడంతో తొలగించాల్సి వచ్చింది. దీనిపై ఆయిల్‌ఫెడ్ అధికారులు, శాస్త్రవేత్తల బృందం పలుమార్లు పరిశీలించినా ఇప్పటివరకు రైతుకు న్యాయం జరగలేదు.

రాష్ట్ర మంత్రి తుమ్మల ఆరా

రేగళ్లపాడు నర్సరీలో భారీ సంఖ్యలో మొక్కలు పనికిరాకుండా పోయిన అంశం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ఏకంగా మూడు లక్షల మొక్కలు ఉపయోగపడవని తేల్చిన నేపథ్యాన ఆయన అధికారుల వివరణ అడిగినట్లు తెలిసింది. ఓవైపు ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుంటే మరోవైపు ఆఫ్‌టైప్ మొక్కలు బయటపడిన అంశంపై ఆయన దృష్టి సారించినట్లు సమాచారం.

అవకాశాలను వినియోగించుకుంటే ఫలితం


నేలపై కూర్చుని విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థినులు అందివచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మంలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సెంటినరీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలను మంగళవారం తనిఖీ చేసిన ఆయన ఆన్‌లైన్ ద్వారా ఐఐటీ, జేఈఈ పరీక్షలకు అందిస్తున్న శిక్షణను పరిశీలించి కళాశాలలో మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి నేలపైనే కూర్చుని మాట్లాడారు. ఆడపిల్లలకు గతంలో చదువుకునే అవకాశం ఉండేది కాదని, ఇప్పుడు అన్నీ సమకూరుతున్నందున జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని, ఆపై మరో పది మందికి చేయూతనివ్వాలని తెలిపారు. కాగా, టాయిలెట్లు, కిచెన్‌రూమ్ సమస్యలను ప్రిన్సిపాల్ రాజలక్ష్మి వివరించగా పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతీ బ్యాచ్‌కు గుర్తుగా కిచెన్ గార్డెన్‌లో మొక్కలు నాటించాలని సూచించారు. ఆతర్వాత కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్టలు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ప్రజాస్వామిక గొంతులను నొక్కేసే ప్రయత్నం..

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాత మధు, పక్కన సండ్ర, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో అద్భుతమైన పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ప్రజాస్వామిక గొంతులను నొక్కేసే ప్రయత్నం చేస్తుందని, ప్రశ్నించే వారిని జైళ్లకు పంపుతోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ విమర్శించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజలు, నిరుద్యోగులను నమ్మించి గెలిచిన కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో మోసం చేస్తోందన్నారు. ఇదేసమయాన మంత్రుల బంధువులే పాలన చేస్తున్నట్లుగా ఉందని, కమీషన్లు వచ్చే ప్రాజెక్టులను పూర్తి చేస్తూ రైతులకు ఉపయోగపడే సీతారామ ప్రాజెక్టు పనుల్లో జాప్యం చేస్తున్నారని విమర్శించారు. ఇక ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న తమ పార్టీ నాయకులు కేటీఆర్, హరీష్‌రావుపై కేసులు పెట్టడం, ప్రజల్లోకి వెళ్తుంటే హౌస్ అరెస్ట్ చేయడం పరిపాటిగా మారిందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించి, ఇంటింటి సర్వే చేశాక పథకాల అమలుకు మళ్లీ గ్రామసభలు ఎందుకు నిర్వహిస్తున్నారో చెప్పాలని సూచించారు. త్వరలోనే గ్రామాల్లో రుణమాఫీపై సర్వే చేస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు గుండాల కృష్ణ, శీలంశెట్టి వీరభద్రం, బొమ్మెర రామ్మూర్తి, బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి..

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మంలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు షేక్ రజాక్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ కేజీబీవీ, యూఆర్‌ఎస్, ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీసం వేతనం ఇవ్వడమే కాక పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, జూలై 2023 నుండి పీఆర్సీ అమలు చేయాలన్నారు. అలాగే, రిటైర్మెంట్ వయసు పెంచాలనే ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవానితో పాటు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, వెంకన్న, రాంబాబు, ఎల్లయ్య, రవికుమార్, నరసింహారావు, సురేష్ పాల్గొన్నారు. కాగా, రఘునాథపాలెంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులంలో నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ గురుకులాల్లో ఉపాధ్యాయులకు పని ఒత్తిడి ఉండడమే కాక మిగతా వారితో పోలిస్తే ఎక్కువ పనిగంటలు ఉండడంతో అనారోగ్యం బారిన పడుతున్నందున హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగమల్లేశ్వర్, లివింగ్‌స్టన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సోలార్' గ్రామాల్లో నేటి నుంచి సర్వే

నేలకొండపల్లి/రఘునాథపాలెం: నేలకొండపల్లి మండలం చెరువుమాధారం, మండల కేంద్రమైన రఘునాథపాలెంను సంపూర్ణ సోలార్ విద్యుత్ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఎంపిక చేసినట్లు విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సురేందర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని గృహ, సర్వీసులకు ఉచితంగా సోలార్ ప్లాంట్లు అందించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం బుధవారం నుంచి సర్వేకు వచ్చే బృందాలకు కావాల్సిన సమాచారం, పత్రాలు అందించాలని కోరారు. కాగా, మధిర నియోజకవర్గం సిరిపురంలో ఇప్పటికే సర్వే పూర్తికాగా వైరాలోని శ్రీరామగిరిలోనూ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ వాడుకుంటూ మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా ఆదాయం సమకూరుతుందని వెల్లడించారు. ఈసమావేశాల్లో డీఈఈ చింతమళ్ల నాగేశ్వరరావు, ఉద్యోగులు శ్రీధర్, కోక్యానాయక్, కె.రామారావుతో పాటు ఈవూరి శ్రీనివాసరెడ్డి, తాతా రఘురాం పాల్గొన్నారు.

నేటినుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ

- అండర్–17 బాలికల విభాగంలో పోటీలు
- ఖమ్మంలోని రెండు వేదికల్లో ఏర్పాట్లు పూర్తి

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సంఘం, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన అండర్–17 విభాగంలో బాలికల క్రికెట్ టోర్నీకి ఏర్పా ట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి మొదలయ్యే పోటీలకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రెండు పిచ్‌లు, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో అదనంగా మరో పిచ్‌లు సిద్ధం చేశా రు. లీగ్ పద్ధతిలో 18 మ్యాచ్‌లు జరుగుతాయని.. ఆతర్వాత సెమీస్, ఫైనల్స్ ఉంటాయని జిల్లా పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శి కె.నర్సింహమూర్తి తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని పాత తొమ్మిది జిల్లాల నుంచి క్రికెటర్లు హాజరవుతారని వెల్లడించారు. ఆయా జిల్లాల నుంచి 144 మంది క్రికెటర్లు, 20మంది మేనేజర్లు, కోచ్‌లు హాజరుకానుండగా నిర్వహణ బాధ్యతల్లో 20 మంది పీడీ, పీఈటీలు పాలుపంచుకుంటారని తెలిపారు.

ఓవరాల్ చాంప్.. సిటీ ఏఆర్ జట్టు


ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన ఏఆర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీపీ సునీల్‌దత్

- వ్యక్తిగత చాంపియన్లుగా గణేష్, భవాని
- ముగిసిన పోలీసు క్రీడాపోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని పోలీస్ పరేడ్ మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోలీసు క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్టు దక్కించుకోగా, వ్యక్తిగత చాంపియన్లుగా పీఆర్ కానిస్టేబుల్ బి.గణేష్, సివిల్ కానిస్టేబుల్ ఎల్.భవానీ దక్కించుకున్నారు. కాగా, ముగింపు సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పాల్గొని బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా టగ్ ఆఫ్ వార్ ఫైనల్స్‌లో వైరా – ఖమ్మం రూరల్ డివిజన్లు పోటీపడగా ఖమ్మం రూరల్ జట్టు విజయం సాధించింది. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేరస్తులు కొత్త పంథా ఎంచుకుంటున్న నేపథ్యాన నేరాలను అరికట్టడం, కేసుల పరిశోధన పోలీసులకు సవాల్‌గా మారుతోందని తెలిపారు. ఈ నేపథ్యాన సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు శారీరక, మానసిక దృఢత్వం అవసరమని చెప్పారు. ఈమేరకు ఒత్తిడి తగ్గించేందుకు క్రీడాపోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, కుమారస్వామి, విజయబాబు, ట్రెయినీ ఐపీఎస్ రుత్విక్‌సాయి, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రెహమాన్, సాంబరాజు, ఫణీందర్, రవి, వెంకటేష్, నర్సయ్య, సుశీల్ సింగ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పాటుపడండి


టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న టీఎన్జీవోస్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ జిల్లా నూతన కమిటీ బాధ్యులు హైదరాబాద్‌లో మంగళవారం టీఎన్జీవోస్ కేంద్ర సంఘం, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదన శ్రీనివాసరావును కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ అభినందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌ఎస్.జైపాల్, కొమరగిరి దుర్గాప్రసాద్, వల్లపు వెంకన్న, యాకూబ్‌పాషా, ఏలూరి హరికృష్ణ, పెద్దినేని రాధాకృష్ణ, ఎర్రమళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు

కల్లూరు: జిల్లాలోని మామిడి తోటలు ప్రస్తుతం మొగ్గ, పూత దశలలో ఉన్నందున తేనెమంచు పురుగు, పూతగూడు పురుగులతో పాటు ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశముందని వైరా కేవీకే శాస్త్రవేత్త చైతన్య తెలిపారు. ఈనేపథ్యాన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కల్లూరులోని పలువురు రైతుల మామిడితోటలను మంగళవారం పరిశీలించిన ఆయన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. తోటల నీటి నిల్వలు లేకుండా చేస్తే తేనె మంచు పురుగు ఉధృతి తగ్గుతుందని, పూత, పిందెలు తయారయ్యే సమయాన ఆకులపైనే కాక మొదళ్లు, కొమ్మలపై మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డై మిథలియేట్ 2 మి.లీ. లేదా క్లోరీపైరిఫాస్ 2.5 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మొగ్గ దశలో తెగులు కనిపిస్తే థయోమిథాక్సిమ్ 0.3 గ్రా. లేదా బ్యూఫ్రిపేషన్ 1–2 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే పురుగును సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చని తెలిపారు. పిందె బఠానీ గింజ నుంచి నిమ్మకాయ సైజ్‌లో ఉన్నప్పుడు మంగు, తామర పురుగుల నివారణకు పిప్రోనిల్ 2 మి.లీ., ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డై మిథోయేట్ 2 మి.లీ.ను నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రవికుమార్, హెచ్‌ఓ జి.నగేష్ పాల్గొన్నారు.


రైతులతో కలిసి ఉద్యమిస్తాం..

చింతకాని: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతులతో కలిసి ఉద్యమాలు చేపడుతామని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు వెల్లడించారు. చింతకాని మండలం కొదుమూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకరావాలని 54 రోజులుగా ఢిల్లీలో రైతు సంఘం నాయకుడు జగ్జిత్‌సింగ్ దల్లేవాల్ దీక్ష చేస్తున్నా కేంద్రప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అలాగే, రాష్ట్రప్రభుత్వం సగం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదని తెలిపారు. ఇకనైనా సబ్సిడీపై వ్యవసాయానికి పరికరాలు అందజేయడమే కాక వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయాలని, అర్హులందరికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కూచి పూడి రవి, పావులూరి మల్లికార్జున్‌రావు, దూసరి గోపాలరావు, అబ్బూరి మహేష్, నక్కనబోయిన సుజాత, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఎనిమిది మందికి గాయాలు

ముదిగొండ: ఆటో బోల్తా పడిన ఘటనలో ఎనిమిది మంది కూలీలకు గాయాలయ్యాయి. వివరాలు.. నేలకొండపల్లి మండలం చెరువుమాదారానికి చెందిన 11మంది కూలీలు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం పెద్దమోదుగుపల్లిలో వరినాట్లు వేసేందుకు మంగళవారం ఉదయం ఆటోలో బయలుదేరారు. ముదిగొండ మండలం వల్లబిలోని పెట్రోల్ బంక్ నుంచి ఓ ద్విచక్రవాహనదారుడు ఒకేసారి రహదారిపైకి రావడంతో తప్పించే క్రమాన కూలీల ఆటో బోల్తాపడింది. దీంతో అమగాని రాంబాయి, పగిడిపర్తి లక్ష్మి, బొల్లికొండ విజయ, పాలకుర్తి వెంకటేశ్వర్లు, ఎస్.కే.రజియా, సూరపల్లి ఇందిరమ్మ, కొమ్ము రాణి, మొగిలి వీరలక్ష్మి, నందిగామ ఉమ, కుక్కల విజయమ్మ, పాలకుర్తి వెంకమ్మ గాయపడగా వల్లబిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నీటి సంప్‌లో పడి వ్యక్తి మృతి


పుల్లారావు (ఫైల్)

సత్తుపల్లిటౌన్: కూలీకి వెళ్లిన వ్యక్తికి ఫిట్స్ రావడంతో సంప్‌లో పడగా మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లి ద్వారకాపురి కాలనీలోని ఓ వ్యక్తి ఇంట్లో నీటి సంప్ శుభ్రం చేయడానికి పెనుబల్లి మండలం టేకులపల్లికి చెందిన గోళ్లమందల పుల్లారావు(42) మంగళవారం వచ్చాడు. నీళ్లు తోడుతుండగా ఆయనకు ఫిట్స్ రావడంతో అందులో పడిపోయాడు. కాసేపయ్యాక గమనించిన స్థానికులు పుల్లారావునుబయటకు తీసి సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్యతో పాటు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉండగా, ఆరు నెలల పసికందుతో భార్య రాణి, పుల్లారావు తల్లి తదితరులు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దు..

ఖమ్మంక్రైం: జనం అత్యాశే ఆయుధంగా సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతారని ఖమ్మం సైబర్ క్రైం డీఎస్పీ ఫణీందర్ వెల్లడించారు. ఈనేపథ్యాన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. విలాసవంతమైన వస్తువులు బహుమతిగా ఇస్తామని, ప్లాట్ రిజిస్ట్రేషన్ చేస్తామని, విదేశీ యాత్రలకు పంపిస్తామనే మాయమాటలు నమ్మొద్దని డీఎస్పీ ఓ ప్రకటనలో తెలిపారు. నిత్యం వాడే సోషల్ మీడియాను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న వారితో అప్రమత్తంగా ఉండాలని, మోసపోయినట్లు గుర్తిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేయాలని సూచించారు.

చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అప్పు తీర్చే సమయంలో ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో వ్యక్తికి జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి శాంతిలత మంగళవారం తీర్పు చెప్పారు. ఖమ్మంకు చెందిన ఏ.మోహన్‌రావు 2012 ఆగస్టులో వశీకరణ బాలరాజు వద్ద రూ.3లక్షల అప్పు తీసుకున్నాడు. ఆతర్వాత 2017లో అప్పు తీర్చే క్రమాన చెక్కు జారీ చేశారు. అయితే, చెక్కును బ్యాంకులో జమచేస్తే మోహన్‌రావు ఖాతాలో సరిపడా నగదు లేక నిరాదరణకు గురైంది. ఈమేరకు బాలరాజు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. విచారణలో నేరం రుజువు కావడంతో మోహన్‌రావుకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

12మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

తల్లాడ: తల్లాడ మండలంలోని అన్నారుగూడెంలో మంగళవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, ఎస్ఐ బి.కొండల్‌రావు ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా అన్నారుగూడెం మొక్క పోచమ్మ ఆలయం గుట్టల సమీపాన పేకాట ఆడుతూ ఆరుగురు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.65 వేలు నగదు, ఆరు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే, తల్లాడలోని ఓ ఇంట్లో తనిఖీ చేసిన పోలీసులు పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 12,660 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

యూరియా ఇవ్వడం లేదని ఆందోళన

రైతులకు మద్దతుగా రాజీనామా చేసిన డైరెక్టర్లు


పీఏసీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, డైరెక్టర్లు

బోనకల్: బోనకల్ మండలం రావినూతల సొసైటీ పరిధిలో రైతులకు యూరియా ఇవ్వడం లేదని ఆళ్లపాడుకు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. సొసైటీ కార్యాలయం ఎదుట చేపట్టిన ఆందోళనకు డైరెక్టర్లు కూడా మద్దతు తెలిపారు. సొసైటీ పరిధిలో రావినూతల, ఆళ్లపాడు గ్రామాలు ఉండగా రావినూతల రైతులకే యూరియా ఇచ్చి తమకు ఇవ్వడం లేదని ఆళ్లపాడు రైతులు వాపోయారు. సొసైటీ చైర్మన్, సీఈఓ ఏకపక్ష వైఖరితో ఈ పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈమేరకు సీఈఓ రాంబాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమ గ్రామానికి ఎంత యూరియా ఇచ్చారో రికార్డులు చూపించాలని పట్టుబట్టారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరావుకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కాగా, సొసైటీ చైర్మన్ మైనేని నారాయణ, సీఈఓ రాంబాబు వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఆళ్లపాడుకు చెందిన డైరెక్టర్లు తోటకూర వెంకటేశ్వరావు, చెన్నకేశ పెద్దవెంకయ్య, వెంకట్రాములు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మందా రామారావు, బుంగా నరేష్, షేక్ పెంటసాహెబ్, ధనమూర్తి, పారా వెంకటమోహన్, ప్రసాద్, మల్లాది లింగయ్యత పాల్గొన్నారు.